సింహాచలకండ్రిగలో పోలీసుల పికెట్

తిరుపతిలో హైటెక్ సిటీ

- ఏర్పాటు దిశగా కూటమి ప్రభుత్వం
- విమానాశ్రయం దగ్గర స్థల పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

హైదరాబాద్ తరహాలో తిరుపతి హైటెక్ సిటీ కానుంది.. బీటెక్, ఎంబీఏ చేసిన విద్యార్థులకు సొంత ఊర్లోనే సాఫ్ట్వేర్ ఉద్యోగ అవకాశాలు లభించబోతున్నాయి.. తిరుపతి విమానాశ్రయం సమీపంలో ఈ హైటెక్ సిటీ నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి స్థల పరిశీలన చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.. ఇప్పటి వరకు ఆధ్యాత్మిక కేంద్రంగా పేరు తెచ్చుకున్న తిరుపతి ఇక ఐటీ రంగంలోనూ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందనుంది..తిరుమల తిరుపతి భక్తుల రద్దీ కారణంగా, దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి తిరుపతికి చక్కటి కనెక్టివిటీ ఉంది. ముఖ్యంగా దేశంలోని అన్ని ప్రముఖ ప్రాంతాల నుంచి రైల్వే కనెక్టివిటీ తో పాటు, జాతీయ రహదారులతో కూడా మంచి కనెక్టివిటీ ఉంది. దీనికి తోడు రేణిగుంట విమానాశ్రయం వల్ల తిరుపతికి పెద్ద ఎత్తున దేశంలోని అన్ని ప్రాంతాలతో చక్కటి కనెక్టివిటీ ఏర్పడింది.

ఈ నేపథ్యంలో తిరుపతి కేవలం ఆధ్యాత్మిక శోభతో మాత్రమే కాదు ఇతర రంగాల్లో కూడా అభివద్ధి చెందేందుకు మంచి అవకాశం ఉంది అని చెప్పవచ్చు. అయితే తాజాగా తిరుపతి ఐటీ రంగంలో కూడా అభివద్ధి చెందే దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా దేశంలోనే ప్రముఖ ఐఐటి కళాశాల తిరుపతిలో ఏర్పాటు చేశారు. అలాగే ఐజర్ వంటి ప్రముఖ విద్యాసంస్థలను తిరుపతిలో ఏర్పాటు చేశారు. అలాగే ఐటి రంగంలో ప్రముఖ సంస్థగా పేరు సంపాదించుకున్న ఐ ఐ టి సైతం ఐటి నిపుణులకు శిక్షణ అందించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. రేణిగుంట విమానాశ్రయం సమీపంలో ఈ ప్రముఖ ఐటీ టెక్నాలజీ శిక్షణా సంస్థను ఏర్పాటు చేశారు. రేణిగుంట ప్రాంతంలో ఏపీఐఐసి కింద స్పెషల్ ఎకనామిక్ జోన్ ఐటి కంపెనీల కోసం ఏర్పాటు చేశారు.

అయితే ఈ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే ఐటీ కంపెనీలు తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయి. ముఖ్యంగా తిరుపతికి ఉన్న ప్రధానమైన అడ్వాంటేజ్ చెన్నై అతి సమీపంలో ఉన్న నేపథ్యంలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కూడా అందుబాటులో ఉంది. దీంతో విదేశీ క్లయింట్లను సైతం ఆకర్షించేందుకు తిరుపతి అనుకూలంగా ఉంది అని చెప్పవచ్చు. ఇక స్థానికంగా ఉన్న యువత కూడా పెద్ద మొత్తంలో బీటెక్ గ్రాడ్యుయేట్లు, ఇతర వత్తి నైపుణ్య శిక్షణ సంస్థల్లో శిక్షణ పొందిన వారు పెద్ద ఎత్తున ఉన్నారు. దీన్ని దష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం సైతం తిరుపతిలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని పెద్ద ఎత్తున అభివద్ధి చేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో తిరుపతి ఒక చక్కటి ఐటీ హబ్ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

మాట వినకుంటే కటకటాలే

సింహాచల కండ్రిగలో 144 సెక్షన్ ఐదుగురు రైతులపై కేసు నమోదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అటవీ చట్టాలను దాటి రిజర్వ్ ఫారెస్టులోకి అక్రమంగా అడుగుపెడితే కటకటాల పాలు చేస్తామని శ్రీకాళహస్తి ఫారెస్ట్ రేంజ్ అధికారి లోకేష్ హెచ్చరించారు. శ్రీకాళహస్తి రూరల్ మండలం పల్లం సెక్షన్, మన్నవరం బీటు, ఇనగలూరు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని సింహాచల కండ్రిగ 144 సెక్షన్ అమల్లో ఉందని స్పష్టం చేశారు. స్థానిక అటవీ శాఖా కార్యాలయంలో ఎఫ్ఆర్వో లోకేష్ ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సింహాచలకండ్రిగ రిజర్వు ఫారెస్ట్ సమస్యపై మాట్లాడారు. 1970లోనే 608 ఎకరాల రిజర్వు ఫారెస్ట్ భూమిని అక్కడ గుర్తించారని చెప్పారు. అయితే 2010లో 90 మంది తమకు రెవెన్యూ పట్టాలు ఉన్నాయనీ, ఆ భూములు తమకే కావాలంటూ కోర్టుకు వెళ్ళినట్లు గుర్తు చేశారు. అయితే కోర్టు వారి ప్రతిపాదనను తోసిపుచ్చిందన్నారు. 2016లో మరో పర్యాయం రైతులు కోర్టుకు వెళ్ళగా న్యాయస్థానం జాయింట్ సర్వేకు ఆదేశించిందనీ, ఇరుశాఖల అధికారులు జాయింట్ సర్వే చేసి అది రిజర్వ్ ఫారెస్ట్ భూమి గానే గుర్తించి పట్టాలు రద్దు చేసినట్లు వివరించారు. భాకరాపేట వద్ద జాతీయ రహదారి-71 కోసం 45 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్ భూమిని కోల్పోగా, దానికి పరిహారంగా సింహాచల కండ్రిగ వద్ద 90 హెక్టార్ల ఫారెస్ట్ భూమిలో చెట్లు పెంచేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఇక్కడ చెట్లు పెంచడం పూర్తయితేనే, భాకరాపేట వద్ద ఉన్న జాతీయ రహదారి పనులు కూడా పూర్తవుతాయనీ, కానీ కొందరు రైతులు రద్దయిన పట్టాలను తీసుకొని అక్రమంగా రిజర్వ్ ఫారెస్ట్ లోకి చొరబడుతున్నారని వాపోయారు. చెట్లు నాటేందుకు వస్తున్న అటవీ శాఖ అధికారులతో గొడవలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 11వ తేదీన చెట్లు నాటేందుకు వెళ్లిన అటవీశాఖాధికారులతో సింహాచలకండ్రిగకు చెందిన కసుమురి కోటయ్య, పామర్తి సాంబ శివయ్య, తక్కిల్లపాటి తిరుపాలయ్య, బండి ప్రసాద్, కసుమురి శంకరయ్యలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని రిమాండ్ కు తరలించనున్నట్లు వివరించారు. అదేవిధంగా ఆ ప్రాంతంలో పోలీస్ శాఖ సహకారంతో 144 సెక్షన్ అమలుపరుస్తున్నామనీ, నిబంధనలు అతిక్రమిస్తే జైలు తప్పదని హెచ్చరించారు.

ఈ పాపం ఎవరిది!

సింహాచలకండ్రిగలోని 93 మంది దళిత కుటుంబాలకు 1996లో అప్పటి ఎమ్మెల్యే బొజ్జల గోపాలకష్ణారెడ్డి1.5 ఎకరాల చొప్పున 103 ఎకరాల ప్రభుత్వ భూమిలో పట్టాలు మంజూరు చేశారు. అయితే పట్టాలు ఇచ్చారే కానీ భూములు చూపలేదు. దీంతో దళితులు తమకు భూములు చూపాలంటూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇదిలా ఉండగానే 2016లో అప్పటి ఫారెస్ట్ శాఖా మంత్రిగా ఉన్న బొజ్జల గోపాలకష్ణారెడ్డి హయాంలో దళితులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేశారు. ఈ క్రమంలో మా భూములు మాకు చూపండంటూ ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్న దళితులపై కేసులు పెడుతున్న పాపం ఫారెస్ట్ అధికారులదా..! లేకుంటే రెవెన్యూ అధికారులదా...! లేకుంటే అప్పటి నేతలదా..! అర్థం కాని పరిస్థితి.

ప్రత్యామ్నాయం చూపాలి: పెనగడం గురవయ్య, వ్య. కా. సం నాయకులు

భాకరాపేట వద్ద జాతీయ రహదారికి నష్టపోయిన రిజర్వ్ ఫారెస్ట్ భూమికి పరిహారంగా సింహాచల కండ్రిగలో దళితులకు కేటాయించిన భూమిని ప్రత్యామ్నాయంగా చూపించారు. మరి ఆ భూమి రిజర్వు ఫారెస్ట్ది అయితే దళితులకు ఇచ్చిన పట్టాల సంగతి ఏంటి. వారికి ప్రత్యామ్నాయ భూమిని అందించాలి కదా. పేదలకో రూల్.. ఫారెస్ట్ శాఖకో రూలా..! తన తండ్రి హయాంలో పేదలకు ఇచ్చిన పట్టాలపై స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పందించి న్యాయం చేయాలి.

వృద్ధురాలిపై పైశాచిక దాడి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు)

మానవత్వం విలువలు మరిచి వృద్ధురాలనిచూడకుండా ఒక ఉన్మాది పైశాచికంగా దాడికి పాల్పడిన ఘటన మండలంలోని చేమూరు పంచాయితీ దళితవాడలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు... గాలి వెంకటమ్మకు కుమారుడు గురవయ్య, కోడలు పార్వతమ్మ ఉన్నారు. కొడుకు కోడలు ఈ మధ్యకాలంలో గొడవలు పడుతుండటంతో కోడలు రెండు రోజులుగా కనపడకపోవడంతో కోడలి తమ్ముడు ఉపేంద్ర శనివారం సాయంత్రం వెంకటమ్మ ఇంటి వద్దకు వచ్చి మంచం మీద పడుకుని నిద్రిస్తున్న ఆమెను వద్దురాలని చూడకుండా దాడి చేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోక పోవడంతో ఆమెను వెంటనే వారి బంధువులు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఇదే విషయం మీద తొట్టంబేడు మండలం ఎస్సై బలరాం ను వివరణ కోరగా గాలి వెంకటమ్మ మీద దాడి జరిగినట్లు ఫిర్యాదు అందిందని కేసును పరిశీలిస్తున్నామని తెలిపారు. వద్ధురాలిపై పైశాచికంగా దాడి చేసిన వ్యక్తిని చట్టపరంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రామారావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

రెండునెలలుగా మున్సిపల్ కార్మికుల నిరసనదీక్షలు

ప్రజాశక్తి - వెంకటగిరి

కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలని, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం నాటికి రెండు నెలలు పూర్తయ్యింది. యూనియన్ జాయింట్ సెక్రటరీ చిరంజీవి మాట్లాడుతూ అవినీతి అక్రమాల రామారావును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దళిత కార్మికులను కులం పేరుతూ దుర్భాషలాడుతున్న రామారావుపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. రామారావుపై చర్యలు తీసుకునే వరకూ సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, సుబ్రమణ్యం, సుబ్బయ్య, కిష్టమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి

నేటినుంచి విద్యారంగ సమస్యలపై నిరసనలు

ప్రజాశక్తి - క్యాంపస్

'పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి' అని 18-20 తేదీల్లో మూడు రోజుల పాటు విద్యారంగ సమస్యలపై మండల కేంద్రాల్లో నిరసన చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, భగత్రవి పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటి సమావేశం ఆదివారం అక్బర్ అధ్యక్షతన జరిగింది. భగత్రవి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో విద్యారంగ సమస్యలు అనేకం ఉన్నాయన్నారు. విద్యాకేంద్రంగా ఉన్న తిరుపతి నగరంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల లేకపోవడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు లేవన్నారు. సాంఘిక సంక్షేమ ప్రభుత్వ వసతిగృహాల్లో సమస్యలు నెలకొన్నాయన్నారు. విద్యలో విప్లవం తీసుకొస్తానన్న మంత్రి నారా లోకేష్కు విద్యాలయాల్లో సమస్యలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్మెంట్ రాక, సర్టిఫికెట్లు తీసుకోలేక విద్యార్థులకు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. నాయకులు అశోక్, వినోద్, తేజ, శ్రీనివాస్, రవీంద్ర పాల్గొన్నారు.



గూడూరు ఎంఎల్ఎకు జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం ఇస్తూ..

గూడూరును జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

'గూడూరును జిల్లాగా ప్రకటించాలి' అని గూడూరు జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించి, ఎమ్మెల్యే సునీల్ కుమార్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేసే ప్రక్రియ జరిగితే గూడూరును తప్పనిసరిగా జిల్లా చేయించేందుకు కషి చేస్తానని, మంత్రుల కమిటీ వద్దకు గూడూరు ప్రజల కోరికను, ఆకాంక్షను అందరి అభిప్రాయాలను మంత్రుల కమిటీ వద్దకు తీసుకుపోతానని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గూడూరు పర్యటనకు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు గూడూరును జిల్లా కేంద్రంగా చేయాలని, అలా లేనిపక్షంలో గూడూరులో వారు ఇచ్చిన హామీ మేరకు గూడూరు ను నెల్లూరు జిల్లాలో కలపాలని కోరతానని చెప్పారు. గూడూరు ను తిరుపతి జిల్లాలో కలిపినందువల్ల సాధారణ ప్రజలు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, అన్ని రంగాల వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, తిరుపతికి వెళ్లాలంటే 140 కిలోమీటర్ల పైగా ప్రయాణించాల్సి వస్తుందన్నారు. గూడూరును జిల్లాగా ప్రకటిస్తే చిల్లకూరు మండలంలో అనేక పరిశ్రమలు ఉన్నాయని, నాయుడు పేటలో మేనకూరు సెజ్, ప్రధానంగా తిరుపతి, చెన్నైకి వెళ్లాలంటే రైల్వే జోన్, పెద్ద రెవిన్యూ డివిజన్, ఉన్నందున ప్రజల ఆకాంక్ష మేరకు ముఖ్యమంత్రి దష్టికి సమస్యను తీసుకెళ్తానని చెప్పారు. గూడూరు జిల్లా సాధన సమితి కన్వీనర్ వేగూరు రాజేంద్రప్రసాద్, సుమన్ రెడ్డి, అశోక్ ,గోపి, పురుషోత్తం, పసల వెంకటేశ్వర్లు, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతి కేంద్రంలోని భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలచే సంయుక్తంగా నిర్వహించబడుతున్న స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్ 2025-26 సంవత్సరానికి మేనేజ్మెంట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బి.ఎస్.సి (హెచ్ అండ్ హెచ్.ఎ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్ లో 40 శాతం పైబడి మార్కులు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి కోర్సుకు ఎస్.ఎస్.సి పాసైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సుకు ఎస్.ఎస్.సి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కోర్సులకు వయోపరిమితి లేదని స్పష్టం చేశారు.కోర్సులు పూర్తయిన అనంతరం ఏపీ పర్యాటక శాఖ హోటళ్లు, ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్లోఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు.యువతీ యువకులకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం ఉందన్నారు. దరఖాస్తులను ఆగస్టు 25 లోగా తిరుపతిలోని కళాశాలకు పంపాలన్నారు. వివరాలకు 9701343846, 9100558006, 9700440604 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. త్వరితగతిన అప్లై చేసుకొని ఈ సదావకాశాన్ని వినియోగించుకొని ఉపాధి పొందాలని ఏపీటీఏ సీఈవో ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిషేధిత జాబితా నుండి మా ప్లాట్లను తొలగించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సొంత స్థలాన్ని కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకోవాలని ఆశతో కొన్న ప్లాట్ల భూమిని రెవిన్యూ అధికారులు 22ఏ జాబితాలో నమోదు చేయడం జరిగిందని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వాస్తవ రికార్డులను పరిశీలించి తమ ఫ్లాట్లో ఉన్న భూమి సర్వే నంబర్లను నిషేధిత జాబితా నుండి తొలగించాలని ఫ్లాట్ల యజమానులు నాగేశ్వరరావు, మరికొందరు విజ్ఞప్తి చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1961 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చారని, ఈ విషయాన్ని విస్మరించిన రెవెన్యూ అధికారులు 1974 రికార్డుల ప్రకారం తాము ఫ్లాట్లు కొనుగోలు చేసిన సర్వే నంబర్లు 19, 23, 24 కు సంబంధించిన వాటిని ప్రభుత్వ భూములుగా చూపుతున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారం కోసం తిరుగుతున్నామని, ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడును, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను కలసి వినతిపత్రం ఇవ్వగా ఆయన కలెక్టర్ కు రెఫర్ చేశారన్నారు. తమకు న్యాయం జరుగుతుందని ఎదురు చూస్తుంటే ఈనెల 7వ తేదీన తిరుపతి ఆర్డిఓ తమ ఫైల్ ను తిరస్కరించారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2015, మార్చి 17వ తేదీన తాము ప్లాట్లు కొనుగోలు చేసిన సర్వే నంబర్లకు సంబంధించి నాలుగు రిజిస్ట్రేషన్లు జరిగి ఉన్న ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా అప్పటి కలెక్టర్ నిషేధిత జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూమి అయితే ఇన్ని రిజిస్ట్రేషన్లు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. చట్టబద్ధమైన అన్ని ఆధారాలను రెవెన్యూ అధికారులు ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎంతో ఆశతో డబ్బులు కూడ పెట్టి కొనుగోలు చేసిన ఫ్లాట్ల భూములు ఈ విధంగా సమస్యల్లో రెవెన్యూ అధికారులు ఇరికిస్తే ఇక న్యాయం ఎవరు చేస్తారని ప్రశ్నించారు. ఇల్లు కట్టుకునేందుకు, ఇతర లావాదేవీలు జరుపుకునేందుకు వీలుకాకుండా ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మీరయ్యా, శారద, పద్మశ్రీ, పద్మావతి, అన్నపూర్ణమ్మ, రామ సుబ్బమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

శివుని సేవలో గుజరాత్ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గుజరాత్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జడ్జి సునీత అగర్వాల్ ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు-కేతు సర్ప దోష నివారణ పూజ చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థ ప్రసాదాలు జ్ఞాపికలు అందజేశారు.

లారీ ఓనర్ మృతి

దొరవారిసత్రం: లారీ ఓనర్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నెల్లబల్లి రెస్ట్ ఏరియలో చోటుచేసుకొంది.

వివరాలు మేరకు చెన్నై నుడి విజయవాడకు వెలుతున్న ఈచర్ లారీ నెల్లబల్లి రెస్ట్ ఏరియాలో విశ్రాంతికొరకు లారీని ఆపుకొన్నాడు. ఆదివారం సాయంత్రం అవుతున్నా లారీలో ఉన్న వ్యక్తి లేవకపోవడంతో, అక్కడ ఉన్న సిబ్బంది, పోలీస్లకు సమాచారం అందించారు. అయితే అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు.మృతుడు విజయవాడ ప్రాంతంలోని పెనుములూరుకు చెందిన వల్లభనేని సురేషబాబు (54)గా గుర్తించారు.శవ పచనామా నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోలీస్ లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మంత్రి పరసారత్నం భార్య కస్తూరమ్మ జ్ఞాపకార్థంఉచిత వైద్యశిబిరం

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

మాజీ మంత్రి పరసారత్నం భార్య కస్తూరమ్మ 5వ వర్ధంతి పురస్కరించుకుని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజు గౌడ్, డాక్టర్ అంబేద్కర్ పూలే ఫౌండేషన్ చైర్మన్ పరసారత్నం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్ లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కొల్లు రవీంద్ర , పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పరసారత్నం అందరివాడే అని కొనియాడారు. తన భార్య జ్ఞాపకార్థం 5వ వర్ధంతి సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం, పేదలకు 28 ప్రైవేట్ ప్రభుత్వ , టిటిడి, కార్పోరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు , ప్రతినిధులు, డాక్టర్ల బందం, సిబ్బంది ఉచితంగా రోగులకు ప్రజలకు పరీక్షల నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ తాను ఎల్లప్పుడూ విద్య, వైద్యానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. తన భార్య కస్తూరమ్మ వైద్య వత్తిలో ఎంతోమంది పేదలకు సేవలు అందించి పలువురికి ఆదర్శం అయ్యారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఎల్ ఎస్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ కల్లూరు భరత్ కుమార్ ,అన్ని కుల సంఘాల ప్రతినిధులు ఆల్ మెన్ రాజు, నరసింహ యాదవ్, సుగుణమ్మ, సి ఆర్ రాజన్, మాజీ మంత్రి గోపాల కష్ణారెడ్డి సతీమణి బందమ్మ, పరసారత్నం అల్లుడు సతీష్ చంద్ర, నగేష్, పరమశివం పాల్గొన్నారు.

తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం తిరుపతికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి తిరుపతి నగర కాంగ్రెస్ అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి సన్మానించి పుష్పగుచ్చం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిత్తూరు శివశంకర్, తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తలారి గోపీచంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

మానవత్వం మసకబారుతోంది..!

- అనుమానాలు.. హత్యలు.. అత్యాచారాలు
- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న 'క్రైం'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఆటలు...పాటలు.. ఆప్యాయతలు... అనురాగాలు.. సుఖసంతోషాలతో అందర్ని కలుపుకుని స్నేహపూర్వక వాతావరణంలో నిస్వార్ధంగా సాగించేదే జీవితం. కానీ నేటి మానవజీవితంలో మానవత్వం మసకబారుతోంది. శరీరం మొత్తం స్వార్ధపూరితం అయ్యింది. మానవుల కన్నా జంతువులు, పశు పక్ష్యాదులే నయం అనేలా మనిషి జీవితం తయారయ్యింది. అందుకే ఎక్కడ చూసిన హత్యలు, అత్యాచారాలు అధికమయ్యాయి. అనుమానాలు, ఆవేశాలు, స్వార్ధాల కారణంగా నేరాలు పెట్రేగిపోతున్నాయి. కేవలం పాతిక రోజుల్లోనే పదుల సంఖ్యలో అఘాయిత్యాలు చోటు చేసుకోవడం ఇందుకు నిదర్శనం. వీటిని అరికట్టాల్సిన పెద్దలు, తల్లిదండ్రులు, టీచర్లే వీటికి కారణం కావడం గమనార్హం.

కట్టుకున్న భార్యపై అనుమానం హెచ్చుమీరడం వల్ల పెళ్లాంతో పాటు ఇద్దరు పిల్లలను బావిలోకి తోసి హత్య చేసి, తాను గొంతుకోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు ఓ అనుమాన పిచాసి. జన్మనిచ్చిన అమ్మ వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుందని అనుమానంతో గొంతునులిమి హత్య చేశాడు ఓ జులాయి కొడుకు. భార్యపై అనుమానంతో నడిరోడ్డులో నరికి చంపి, ఇంటిలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న కర్కశ మొగుడు. కన్నకూతురు అందున మైనరు అనిచూడకుండా తన కామవాంఛ తీర్చుకున్న కసాయి తండ్రి. మద్యానికి బానిసైన తనను వదిలి వెళ్లిన భార్యను కాపురానికి పంపలేదని కక్షపెంచుకుని అత్తను హత్య చేసిన అల్లుడు. 20 ఏళ్లు కూడా నిండని బాలికను ఏడాదిగా బెదరిస్తూ



బలత్కరం చేసిన 66 ఏళ్ల వృద్ధుడు. తనతో సహజీవనం చేస్తున్న మహిళా మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందనే అనుమానంతో అతడిపై కిరాయి మనుషులతో హత్య యత్నానికి పాల్పడిన ఘటన. తన కూతురు వెంట పడద్దు అన్న తండ్రి మాటలతో కక్ష పెంచుకుని 15 సంవత్సరాల బాలికను ఉరివేసి హత్య చేసిన ఉన్మాద ప్రేమికుడు. తమ అక్రమ సంబంధానికి అడ్డున్నాడని ప్రియుడితో కలిసి భర్తని హత్య చేసిన బార్య. తమ రహస్యాలు బయటపెడుతున్నాడనే అనుమానంతో నమ్మినబంటుని హత్య చేసి, పరాయి రాష్ట్రంలో పాతిపెట్టిన విషాదకర ఘటన. ఇలాంటి కథనాలు సినామాల్లోనో...టివి సీరియల్స్లోనో.. వెబ్సేరీస్, యూట్యూబు చిత్రీకరణలో కాదు సుమా నిజజీవితంలో యదార్ధంగా గత నెలరోజులుగా చోటు చేసుకున్నవే.

అందులోనూ ఒక జిల్లాలో కేవలం పాతికంటే పాతిక రోజుల్లో వెలుగు చూసిన పచ్చి నిజాలు. గడిచిన పాతిక రోజుల్లో తిరుపతి జిల్లాలో జరిగిన ఈ ఘటనలు ఏ దినపత్రికను తిరగేసిన దర్శినమిస్తాయి. మానవత్వం మసకబారిపోయిందనడానికి ఇంతకంటే వేరే నిదర్శనం అక్కర్లేదు. ఇవ్వేకావు చిన్న చిన్న విషయాలకే క్షణకావేశంలో హత్యలకు..హత్యాయత్నాలకు పాల్పడటం పరిపాటిగా మారిపోతోంది. ఇలాంటి ఘటనలు జిల్లాల్లో కోకొల్లాలు.

స్నేహితుడు సిగరెట్ ఇవ్వలేదని అతనిపై కత్తితో దాడి. రౌడియిజం మంచిది కాదని హితవు పలికినందుకు ఓ వ్యక్తి కాళ్లు చేతులు కట్టేసి అతికిరాతకంగా హత్య. తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్యలు, తమ ప్రేమను అంగీకరించలేదని బలర్మరణం పొందుతున్న మైనర్ ప్రేమికులు. తన అవసరాలకు తగ్గ కట్నం తేలేదని బార్యను హతమార్చుతున్న భర్తలు. తమ అక్రమ సంబంధాలకు అడ్డుగా ఉన్నారని ప్రాణాలు తీస్తున్న ఘటనలు చోటు చేసుకోవడం శోచనీయం. పోలీసులు, చట్టాలు, రాజకీయ అండదండలు అధికం కావడంతో, పలుకుబడి ఉన్నవాడు ఏమైన చేయగలమనే ధీమా ప్రబలుతోంది. మనుషులు మానవమృగాలుగా మారుతున్న ఈ తరుణంలో మానవీయ విలువలను పొందించాల్సిన అవసరం చాలా ఉంది. తప్పును తప్పు అని చెప్పేవారే కరువవుతున్నారు. వాడుతో పోల్చితే వీడే నయంలే అన్న పంథా కొనసాగుతోంది. ఇలాంటి వాటికి పుల్స్టాప్ పెట్టి, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాస్వామ్యవాదులు ప్రజల్లో మానవత్వం పెంపొందించే కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలి. చట్టాలు ఒకరికి చుట్టం అనే పంథాన కాకుండా, ప్రతి ఒక్కరికీ సమానమే అన్న ధోరణిలో ఉండాలి. పోలీసు, రాజకీయ వ్యవస్థ నిక్కచ్చిగా పని చేస్తే ఇలాంటి వాటిని అరికట్టవచ్చు. ఆ దిశగా మానవత్వాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తారని ఆశిద్దాం.

పేదలకు వైద్య శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని మాయా బజార్‌లోని కేవీ హాస్పిటల్ లో బీపీ, షుగర్ బాధితులకు వైద్య శిబిరం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు ఎక్కువగా నివసించే ప్రాంతంలో గోపాల్ అన్న అతిపెద్ద కెవి హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి మంచి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా వున్నారని వేలాది రూపాయలు మందులకు ఖర్చు అవుతున్నాయని ఇలాంటి పరిస్థితుల్లో పేదకు కేవీ హాస్పిటల్ జీబీఆర్ ఫౌండేషన్ వారు 200 రూపాయలకే రెండు నెలలకు సరిపడా మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. పేదప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్, డాక్టర్లు త్రివిక్రమ్, కీర్తి నారా , లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తక్కువ ధరకే మందులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

23న జర్మనీ నర్సింగ్ ఆఫ్ లైన్ శిక్షణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి బైరాగి పట్టెడ గిరిజన భవనంలో ఈనెల 23వ తేదీ జర్మన్ నర్సింగ్ ఆఫ్ లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నెల్లూరు మల్లికార్జున్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సెక్రటరీ సూచనల మేరకు రాయలసీమ జోన్ నెల్లూరు కలుపుకుని తిరుపతి లో శిక్షణ ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ సెక్రెటరీ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఎండీ, సీఈవో, ఏపీ ఎస్ఎస్‌డిసి కలెక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు. జీఎన్ఎమ్ కోర్సు పూర్తి చేసిన వారికి ఒక సంవత్సరం అనుభవం ఉండాలన్నారు. బిఎస్‌సి నర్సింగ్ చేసిన వారికి ఆరు నెలలు అనుభవం ఉంటే సరి పోతుందన్నారు. ఈ అవకాశాన్ని ఎస్‌సి, ఎస్‌టిలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అనుమతి తప్పనిసరి: డిఎస్‌పి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: వినాయక చవితి ఉత్సవాలకు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని గూడూరు డిఎస్‌పి గీతా కుమారి పేర్కొన్నారు. గూడూరు సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో డిఎస్పీ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక ఉత్సవాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో డిజె, బాణసంచాలకు అనుమతి లేదన్నారు. ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా కమిటీ సభ్యులు చూసుకోవాలన్నారు. ఎలాంటి నీచ సంఘటనలు చోటుచేసుకోకుండా పండుగను ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాస్ , కిషోర్ బాబు , ఎస్‌ఐలు తిరుపతయ్య, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం

రైతుల హర్షం

ప్రజాశక్తి-తడ: తడ మండలంలో శనివారం రాత్రి నుండి ఆదివారం వరకు వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొలం పనుల్లో నిమగ్నం కావచ్చని సంతోషంగా వున్నారు. ఎగువ ప్రాంతాలలో అధికంగా వర్షం కురుస్తున్న కారణంగా వాగులు, వంకలకు అధికంగా చేరుతున్నాయని నీటి కారణం గా వరదలు వచ్చే ప్రమాదం వుందని అధికారులు అప్రమత్తంగా వుండాలని రైతులు కోరుతున్నారు.

వైద్య రంగంలో ఆర్‌ఎంపీల పాత్ర కీలకం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైద్యరంగంలో ఆర్‌ఎంపీ డాక్టర్ల పాత్ర కీలకమేనని ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ పేర్కొన్నారు. స్థానిక ఎంజీఎం ఆసుపత్రి ఆవరణలో తూర్పు మండలాల ఆర్‌ఎంపీ డాక్టర్లతో ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. మారుమూల ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల ప్రజలకు సైతం ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్యాన్ని అందించి స్వాంతన చేకూరుస్తున్నారని కొనియాడారు. ఆర్‌ఎంపి వైద్యులకు ఎంజీఎం ఆసుపత్రి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు.

ఆరణి మదన్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఘనంగా ఆరణి మదన్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: జనసేన యువ నాయకులు ఆరణి మదన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కేక్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన చిన్న కుమారుడు జగన్ తో కలిసి కట్ చేశారు. అనంతరం 18, 19 డివిజన్ లలో జేఎంసి ట్రస్ట్ తరుపున ఏర్పాటు చేసిన రెండు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ల ను ఎమ్మెల్యే ఆరణి, శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడులు ప్రారంభించారు. ఎంఆర్ పల్లి పరిధిలోని రెండు డివిజన్ ల్లో రెండు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను జెఎంసి ట్రస్ట్ తరుపున ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవకోనలోనూ రెండు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను మూడు నెలల క్రితం సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్లు సికే రేవతి, వరికుంట్ల నారాయణ, పొన్నాల చంద్ర, ఎస్ కే బాబు, మహేష్ యాదవ్, రాజా రెడ్డి, నీలాద్రీ, వివేక్, ఉదయ్ కుమార్, జానకి రామ్ రెడ్డి, దుర్గా మల్లేష్, మురళీ, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆళ్వార్ మురళీ, ఆముదాల వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన ఆదివారం ఊరందూరు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. సూళ్లూరుపేటకు చెందిన గిరీష్(48) ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళుతుండగా ఊరందూరు వంతెనపై లారీ వెనుక నుంచి వేగంగా ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ సంఘటనలో గిరీష్ తీవ్రంగా గాయపడగా 108 సాయంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి ఏది?

- ప్రభుత్వాలు మారుతున్నా మౌలిక సౌకర్యాలు కరువు
- తేలికపాటి వర్షానికీ నడవలేని పరిస్థితి
- ఇబ్బందుల్లో దళితవాడ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: గ్రామీణ ప్రాంతాలను తమ ప్రభుత్వ హయాంలో బాగా అభివృద్ధి చేస్తున్నామని, సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసి ఏ ప్రభుత్వ హయాంలోనూ చేయని అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వ పాలకుల మాటలు ఎక్కడా కానరావడం లేదు. కనీసం తేలికపాటి వర్షం కురిసినా ఆ దళితవాడ వాసులు వీధుల్లో తిరగాలన్నా ఇబ్బందులకు గురవుతున్నారు. పాలకులకు, అధికారులకు ఎన్ని అర్జీలు ఇచ్చినా తమ గ్రామంలో కనీసం మౌలిక సౌకర్యాలు కూడా కల్పించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

మౌలిక సౌకర్యాలు కరువు

వెంకటగిరి మండలం సోమసానిగుంట పంచాయతీ పాలకొండసత్రం గ్రామం అరుంధతివాడలోని వీధుల్లో తేలికపాటి వర్షం కురిసినా వీధుల్లో నీళ్లు చేరి బురదమయం అవుతున్నాయి. ఎన్నో ఏళ్ల నుండి ఈ దళితవాడలో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయలేదు. మురుగు కాలువలు వున్నాయి. అయితే వర్షపు నీరు అందులో వెళ్లకపోవడంతో వీధులు బురదమయం అవుతున్నాయి. దీంతో వీధుల్లో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది.

పట్టించుకోని ప్రభుత్వాలు

ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితవాడ పరిస్థితి మారడంలేదు. గత ప్రభుత్వం హయాంలో అధికారులకు, పాలకులకు ఎన్నో అర్జీలు సమర్పించుకున్నా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వ పాలకులు తమను పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. ఈ కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యను పరిష్కరిస్తుందని పాలకొండసత్రం గ్రామం అరుంధతివాడ వాసులు ఎదురుచూస్తున్నారు.

తేలికపాటి వర్షానికే బురదమయమైన దళితవాడ వీధి

హామీలు అమలు చేయాలి

ఆటో వర్కర్స్ యూనియన్ డిమాండు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టక ముందు లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ నెల 19 వ తేదీ తిరుపతిలో నిర్వహించనున్న ఆటో వర్కర్స్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆ సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహిళా ఉచిత ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, దీని ద్వారా ఆటో కార్మికుల బతుకులు బజారున పడకుండా రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు యువగళంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా ప్రతి ఆటో కార్మిక కుటుంబానికి 15 వేల రూపాయలు ఇస్తామని, డ్రైవర్ల సంక్షేమ బాధ్యతను తీసుకుంటామని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, ప్రమాద బీమా హెల్త్ ఇన్సూరెన్స్ ఆటో ఇన్సూరెన్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని వీటిని నెరవేర్చాలని కోరారు. ఆర్టీవో, పోలీసుల దాడుల నుంచి ఆటో డ్రైవర్లను అపరాధాలు వసూలు చేయకుండా వారికి టార్గెట్స్ ఇవ్వకుండా చూస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది వాహన మిత్రులను అమలు చేస్తానని హామీ ఇచ్చారని, ఓలా, ఉబర్ రాపిడో వల్ల ఆటో కార్మికులకు సంపద మొత్తం కోల్పోతున్నారని వారికి ప్రభుత్వం తరపున ఒక యాప్ ను ఇవ్వాలని కేరళ తమిళనాడు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వమే యాప్‌ను ఇస్తోందని అలా ఇవ్వాలని డిమాండు చేశారు. జీవో నెంబర్ 21ని పూర్తిస్థాయిలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో ఆటో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ జయ చంద్ర, సిఐటియు నగర అధ్యక్షులు టి సుబ్రమణ్యం, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి టి మురళి నగర ప్రధాన కార్యదర్శి వాసు అధ్యక్షులు బాదుల్లా, రవి, మురగ, రమణ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : ఈనెల 19వ తేదీన వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఆటో వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా రెండవ మహాసభలో ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. పుత్తూరు ఆటో స్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు మహాసభల కరపత్రం ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్, ఆటో యూనియన్ కార్యదర్శి ఏ విజయ్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఆటో కార్మికుల సమస్యపై అనేక పోరాటాలు చేసి ఫలితాలు సాధించామన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానం ప్రకారం పెట్రోల్ , డీజిల్ ధరలు తగ్గించాలని, సబ్సిడీ ఎలక్ట్రికల్ ఆటోలు అందించాలని ఆటో స్టాండ్ లోనే చార్జింగ్ పాయింటును ఏర్పాటు చేస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉచిత బస్సు పథకం ఆటో కార్మికుల జీవితాలకు అడ్డంకిగా మారిందన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. ఈ మహాసభలో ఈ సమస్యలన్నింటిని చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ మహాసభలో జిల్లాలోని ఆటో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ విజయ్, యాషన్ బాష, రామలింగం, సుబ్రహ్మణ్యం, దేవారెడ్డి పాల్గొన్నారు.

తిరుపతిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలి

తుడా విసి శుభం బన్సల్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రభుత్వం ప్రకటించిన అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలని తుడా వైస్ చైర్మన్ శుభం బన్సల్ పేర్కొన్నారు. 2020 డిసెంబర్ 31 నాటికి దరఖాస్తు చేసుకోలేని ప్లాట్ యజమానులకు ప్రయోజనం కల్పించడానికి, 2025 జూన్ 30కి ముందు వేసిన అనధికార లేఔట్లలో రిజిస్ట్రేషన్ అయిన అనధికార ప్లాట్లను ప్రణాళిక బద్ధంగా తీసుకొచ్చేందుకు ఈ పథకం కొనసాగుతుందన్నారు. ఈ పథకం మున్సిపల్, స్థానిక సంస్థలు, అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ వెలుపల మాస్టర్ ప్లాన్లు, జోనల్ డెవలప్‌మెంటు ప్లాన్లు పరిధిలోని గ్రామ పంచాయతీలు, పరిశ్రమల ప్రాంత పరిధిలోని ప్రాంతాలకు వర్తిస్తుందన్నారు. ఈ పథకంలో ఆమోదించబడిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ద్వారా కానీ, స్వయంగా కానీ అనధికార లేఅవుట్ లో ఉన్న స్థలాల ప్లాన్లు తయారుచేసుకుని అపరాధ రుసుంతో 50 శాతం, 10 వేల రూపాయలకు తగ్గకుండా చెల్లించి నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచి 90 రోజులలోపు సంబంధిత యాజమాన్యపు హక్కు పత్రం ప్లాన్లతో ఆన్‌లైను పోర్టల్ డిటిసిపి.ఎపి.జిఓవి.ఇన్ ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని అక్రమ లేఅవుట్ వేసిన యాజమాన్యం అందులో ప్లాట్స్ కొనుగోలు చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేద్కర్ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు..

సహకరించాలని ప్రజా సంఘాల పిలుపు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతిలోని ఏడు కాలనీల సెంటర్‌లో (ఎస్‌వి మెడికల్ కాలేజ్ కూడలి) వద్ద అసంపూర్తిగా ఆగిపోయిన అంబేద్కర్ భవన నిర్మాణం ముందుకు సాగకుండా పెత్తం దారులు అడ్డుకుంటున్నారని వారి ఆటలు సాగవని, అందరూ తమకు సహరించాలని రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, మాలల ఉద్యమాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ కోరారు. ఏడు కాలనీల సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏడు కాలనీల మాజీ ప్రెసిడెంట్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు కాలనీల సెంటర్లో అంబేద్కర్ భవన నిర్మాణాన్ని అగ్రకులాల నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వివిధ ప్రజా, కుల సంఘాలు ఏకతాటిపైకి వచ్చి త్వరలోనే అడ్డంకులు అధిగమించి అంబేద్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఇక్కడ అంబేద్కర్ భవన నిర్మాణాన్ని ఆపాలని చూస్తే తిరుపతి నగరంలో అధిక శాతం ఉన్న మాల మాదిగల ఉగ్రరూపం ఎలా ఉంటుందో చూపిస్తామని హెచ్చరించారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, మాలల ఉద్యమాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్, ఏడు కాలనీల ప్రెసిడెంట్ రమేష్ కుమార్, కార్యదర్శులు వెంకటేష్, జయప్రకాష్, ఉపాధ్యక్షులు దేవరాజులు, అరుణ్ కుమార్, కార్పొరేటర్లు ఎస్కే బాబు, అనిల్ కుమార్, అడ్వైజర్ రాజశేఖర్, ఇతర దళిత నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడాకారులతో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్ బొల్లినేని జగన్నాథం నాయుడు

క్రీడలతో శారీరక దారుఢ్యం పెంపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: క్రీడలు మానసిక, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని టిడిపి సీనియర్ నేత, సంఘసేవకులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్ బొల్లినేని జగన్నాథం నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్న క్రీడాకారిణులను ఆదివారం ఆయన కలిశారు. ఆట నైపుణ్యాలను వివరించారు. క్రీడల వల్ల కలిగే లాభాలను వివరించారు. ఉత్తమ క్రీడాకారులుగా రాణించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. న్యాయవాది వెంకటస్వామి పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో డాక్టర్ సిఆర్‌రెడ్డి ఆసరా పేరిట సింహపురి రెడ్డి సంఘం ఆధ్వర్యం లో ఆదివారం ఫలసరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సనత్ కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి ప్రతి నెలా మూడవ ఆదివారం క్రమం తప్పకుండా 20 మందికి నెలకు సరిపడా సరుకులు ఇస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. వీరు రెడ్డి సంఘానికే కాకుండా అనేక సేవా సంస్థలకు సహాయ సహకారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండి శ్రీనివాసులు రెడ్డి, బండి ధనంజయ రెడ్డి, దువ్వూరు విజయ భాస్కర్ రెడ్డి, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

నగరి నియోజక వర్గంలో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందే నిమిత్తం బాధితులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదివారం పంపిణీ చేశారు. పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలోని వినాయక పురానికి చెందిన ఏడీ సరస్వతికి రూ.42,477, వడమాల పేట మండలం టిసి అగ్రహారానికి చెందిన ఎం శంకరయ్యకు రూ.62,038, చింతల పట్టెడకు చెందిన రూ.44,041, నగరిటౌన్‌కు చెందిన ఎన్‌సిశేఖర్‌కు రూ.48,734 చెక్కులు అందించారు. ఎంవి ఏకాంబరానికి రూ.18 వేలు, సత్రవాడకు చెందిన ఎ షణ్ముగంకు రూ.41,084, నగరి రూరల్ మండలం కెజి కుప్పంకు చెందిన జి నాగూర్ కు రూ.48,734, నింద్ర మండలం పాదిరికి చెందిన అజయ్‌కు రూ.66,500, మొత్తం ఎనిమిది మందికి రూ.3,67,074 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే భాను ప్రకాష్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడమాల పేట మండలం ఎస్‌విఆర్ పురం సర్పంచ్ మణిరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఏసీఏ జాయింట్ సెక్రటరీగా క్రికెట్ విజయ్

జిల్లాకు ఏసీఏలో మొట్టమొదట స్థానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలలో తిరుపతికి చెందిన విజయ్‌కుమార్ (క్రికెట్ విజయ్) జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఏసీఏలో ఇంత వరకు పదవులు దక్కిన దాఖలాలు లేవు. 1953లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసిఏ) స్థాపించబడింది. అప్పటినుంచి ఇప్పటివరకు క్రికెట్ చరిత్రలో దాదాపు 72 సంవత్సరాలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఏసీఏ లో పోటీ చేసిన దాఖలాలు, గెలిచిన దాఖలాలు లేవు. 72 సంవత్సరాల తరువాత మొట్టమొదట తిరుపకి చెందిన విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) ఏసీఏ ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించడంపై క్రీడాకారులు, క్రికెట్ అభిమానులు జిల్లాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై మక్కువతో క్రికెట్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయడంతో పాటు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్‌గా ఆయన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ప్రతి క్రికెటర్ గొప్ప క్రికెటర్ కావాలని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రికెట్ అభివృద్ధి చెందాలని ఆయన చేసిన కృషి మరువలేనిది. ఇంటిపేరును సైతం క్రికెట్ విజయ్‌గా మార్చుకున్న విజయ్ కుమార్ ఏసీఏ జాయింట్ సెక్రటరీగా ఎంపిక కావడంపై జిల్లా, రాష్ట్ర నాయకులు, క్రికెట్ అభిమానులు అభినందనలు తెలుపుతున్నారు. ఈ నెల 3వ తేదీ నామినేషన్లు ముగిసి, 6వ తేదీ నామినేషన్న్లు పరిశీలించారు. నామినేషన్లలో ఒక్క జాయింట్ సెక్రటరీ పదవికి తప్ప అన్ని పదవులకు పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీ పోస్ట్‌కు తిరుపతి నుంచి విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్), న్యూ క్రికెట్ క్లబ్ కార్యదర్శి శ్రీనివాసరాజు నామినేషన్లు దాఖలు చేశారు. 11వ తేదీ స్క్రూటీలో శ్రీనివాసరాజు నామినేషన్ చెల్లకపోవడంతో అతని నామినేషన్ రద్దు చేశారు. దీంతో పోటీ జరగాల్సిన జాయింట్ సెక్రెటరీ ఒక్క పోస్ట్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఎన్నికలలో ఏ పోస్టుకు ఎటువంటి పోటీ లేకపోవడంతో ఏసిఏ ఫలితాలను వెల్లడించింది. దీంతో ఏసిఏ అధ్యక్షులుగా కేశినేని శివనాథ్(చిన్ని), కార్యదర్శిగా సానా సతీష్ బాబు, కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా విజయ్ కుమార్(క్రికెట్ విజయ్), కౌన్సిలర్ గా విష్ణుదంతు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చిత్తూరు క్రికెట్ అసోసియేషన్ కమిటీ, కోచ్ లు, క్రికెటర్లు ఆయనకు అభినందనలు తెలిపారు.

చంద్రబాబు దగా చేశారు: వైసిపి

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలకు మోసం చేశారని వైసిపి నాయకులు ఆరోపించారు. బిఎన్ కండ్రిగ మండలం విఎస్ పురం పంచాయతీలో సత్యవేడు వైసిపి ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్, మండల అధ్యక్షుడు కె మణి నాయుడు ఆదివారం రీ కాల్ మ్యానిఫెస్టో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను దగా చేశారని విమర్శించారు. ఇలాంటి ముఖ్యమంత్రిని రీకాల్ చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు వస్తే హామీలు అమలు ఏదీ? అని నిలదీయాలని సూచించారు. ఈ కార్యక్రమం కిరణ్ యాదవ్, భాను ప్రకాష్ రెడ్డి, ముని రెడ్డి, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి గురునాధం, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎఎస్ నూతన శాఖ ఏర్పాటు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి నగరంలో బైరాగి పట్టడ లోని వీక్ష ది స్కూలులో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తిరుపతి జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఎంఎఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా డాక్టరు పాకనాటి హరికృష్ణ, (ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఎస్వీయూ), కార్యదర్శిగా పి రామచంద్రయ్య, (టిటిడి ఏఇఇ), కోశాధికారిగా కృష్ణ ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. న్యాయ సలహాదారుగా కె నేతాజీ, ఉపాధ్యక్షులుగా ఓం ప్రకాష్ రెడ్డి, డాక్టర్ ఆనంద్ రావు, రాఘవులు, డాక్టరు బి వెంకటేశ్వర్లు, సి రామయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టరు రామకృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీస్ గా రెడ్డప్ప, రమేష్, రఘు, ఆచార్య నాగలక్ష్మి దేవమ్మను ఎన్నుకున్నారు. ఈసీ మెంబర్లుగా ధర్మయ్య, అశోక్ రెడ్డి, భాస్కర్ యాదవ్ ను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ కార్యదర్శి రామచంద్రయ్య మాట్లాడుతూ ఇండియా, ఆసియా, ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌లకు అనుబంధంగా పనిచేస్తామన్నారు.

ఉచిత బస్సు సౌకర్యంపై హర్షం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభంపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. పుత్తూరు రూరల్ మండలం రామకృష్ణాపురం పంచాయతీ గొల్లపల్లిలో ఆదివారం జనసేన నాయకులు శ్రీరామ్ గోపి రాయల్ ఆధ్వర్యంలో మహిళలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం హరి, వరప్రసాద్, అమృతమ్మ, లక్ష్మి, సుబ్బమ్మ, దివ్య, మునెమ్మ, జె బాంబు రాయల్, బి జగ్గయ్య రాయల్, జి జానకమ్మ పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో గుడ్లు, కూరగాయలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుడ్లు , కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆర్ఆర్ జనరల్ మర్చంట్ అధినేత ప్రభాకర్ దాతృత్వంలో విశ్రాంత ఉద్యోగుల భయంలో గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా కూరగాయలు, గుడ్లు ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథి గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడు తూ జెవివి వంటి సంస్థలు సమాజానికి చాలా అవసరమని సమాజంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన కల్పిస్తూ అనేక సేవా కార్యక్రమాలలో జెవివి పాల్గొనడం చాలా అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు 12 ఏళ్లుగా భోజనాలు పంపిణీ చేస్తున్నామని జెవివి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, సుమన్ రెడ్డి, ఇబ్రహీం, శ్రీనివాసఆచారి, అశోక్, అరుణ్ కుమార్, దినేష్, జాన సుధీర్ పాల్గొన్నారు.

ఆలయ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు

ఆలయ ఛైర్మన్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

స్థానిక సదాశివేశ్వర స్వామి ఆలయ పాలకమండలి నూతన ఛైర్మన్‌గాకే దిలీప్ కుమార్ ఎన్ని కయ్యారు. ఈ సందర్భంగా బలిజ సంఘం అధ్యక్షులు పసుపులేటి శివయ్య, కార్యదర్శులు హేమాద్రి ఆధ్వర్యంలో బలిజ సంఘం భవనంలో ఆదివారం అందరూ శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విక్కీ రాయల్, గోపి రాయల్, డి జయప్రకాష్, రాజేంద్ర, కొడగంటి శ్రీనివాసులు, రమేష్, చక్రవర్తి, కృష్ణయ్య, మునెయ్య, నందయ్య, (ఓవిఆర్) వెంకటరమణ, పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో కూరపాటిశంకర్ రెడ్డి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలం లోని కాంపాళ్యం పంచాయతీలో ఆదివారం నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఆదివారం కాంపాళెం పంచాయతీకి సత్యవేడు నియోజక వర్గం ప్రోగ్రాం ఆర్గనైజర్ శంకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమం మండల టిడిపి ప్రెసిడెంటు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE: SRIKALAHASTI
O.S. No. 119/2023

Between:
K. Sreeramulu Reddy (Died) By LRs. K. Vijayamma & others ...**Plaintiffs / వాదులు**
And
Ravilla Munirathnamma & others ...**Defendants / ప్రతివాదులు**

To
(D-13) S. Vijayamma, W/o Late Sathyam Reddy Hindu, aged about 65 years, house wife
(D-14) S. Lakshmi Uday Kumar, S/o Late S. Sathyam Reddy Hindu, aged about 40 years, cultivation
(D-15) S. Prathap Reddy, S/o Late Sathyam Reddy Hindu aged about 37 years, business; Defendants No. 13 to 15 are residing at Chenchurami Chetty Kandriga Village, Godali Vaari Palem Post. Varadaiah Palem Mandal, Tirupati District....**Defendants / ప్రతివాదులు**

నోటీసు ప్రకటన

పై నెంబరు దావాలో 13, 14, 15 నెంబర్లు గల ప్రతివాదులకు దావా సమన్లు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా పంపియూ జారీ కానందున సదరు ప్రతివాదులకు substituted service of Notice నిమిత్తము 29-08-2025 వ తేదికి వాయిదా వేసి యున్నారు. కావున సదరు ప్రతివాదులు అయిన D-13. D-14, D-15 సదరు వాయిదాకి ఉదయం 10:30 గంటలకు సదరు కోర్టు వారి ఎదుట హాజరై వారి ఆక్షేపణలను తెలుపు కొనవచ్చును. లేని యెడల వారి పరోక్షమందు సదరు దావాను తీర్మానించబడును.

E. PRABHAKARA REDDY
Advocate for Plaintiffs
Srikalahasti